క్లుప్తంగా

నేడు భీం వర్ధంతి సమావేశం

కెరమెరి: మండల కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో నేడు ఉదయం 10 గంటలకు కుమురం భీం వర్ధంతి నిర్వహణపై ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ పెందోర్ రాజేశ్వర్, కన్వీనర్ పెందోర్ మోతిరాంలు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఆదివాసీలు, పటేళ్లు, దేవారీ, విద్యార్థి, యువజన, వివిధ సంఘాలు, మహిళా సంఘ నాయకులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు చేస్తున్న ఎంపీడీవో

కెరమెరి: మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వర్తిస్తున్న 100 మంది పారిశుధ్య కార్మికులకు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం పలువురికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో అంజద్‌పాషా, సిబ్బంది పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు విజయవంతం చేయండి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

వాంకిడి: కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు గుర్నులె నారాయణ కోరారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నాయకులతో కలిసి పోటీలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకుని మండల కేంద్రంలో ఈనెల 8 నుంచి 12 వరకు కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విజేతలకు మొదటి బహుమతి రూ.16 వేలు, రెండో బహుమతి రూ.8 వేలు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్, దుర్గం ప్రశాంత్, అనిల్, గణేష్, దాదాజీ, జైరాం, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

ఆసిఫాబాద్‌అర్బన్: మండలంలోని బురుగుడా గ్రామంలో ఇటీవల జరిగిన సంఘటనకు బాధిత కుటుంబానికి అండగా ఉంటామని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్ అన్నారు. సోమవారం మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గౌడ్‌తో కలిసి బురుగుడ గ్రామంలోని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మైనర్ బాలికపై అత్యాచారం జరగడం బాధాకరమని, బాలికకు ప్రభుత్వం తరపున అండగా నిలుస్తామన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో మేకర్తి శ్రీనివాస్, కిష్టయ్య, అరుణ్, సంజీవ్, సాయి క్రుష్ణ, వినోద్, ప్రవీణ్, ఇస్మాయిల్, కిరణ్ పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ఆర్‌ఎంపీ

వాంకిడి: అనుమతులు లేని యాంటిబెటిక్, ఇతర మందులు అమ్ముతున్న ఆర్‌ఎంపీ వైద్యుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ధాబా గ్రామంలో కొండల్ సంతోష్ అనే ఆర్‌ఎంపీ వైద్యుడు ఎలాంటి అనుమతులు లేని మాత్రలను రోగులకు విక్రయిస్తున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి వెళ్లి పరిశీలించి మందులను స్వాధీనం చేసుకున్నారు. ఆర్‌ఎంపీ వైద్యుడిని, మాత్రలను డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అశ్వినికి అప్పగించారు. పట్టుబడిన డ్రగ్స్ విలువ రూ.15 వేలు ఉంటుందని, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ విచారణ అనంతరం తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్సై పేర్కొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

చింతలమానెపల్లి: మండల జానపద కళాకారుల సంఘం ఎన్నికను సోమవారం నిర్వహించారు. మండలంలోని ఖర్జెల్లి గ్రామంలోని ఓంకార ఆశ్రమంలో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చౌదరి సత్యన్న, గౌరవ అధ్యక్షుడిగా జునుగరి శేఖర్, ఉపాధ్యక్షుడిగా డుబ్బుల సంజీవ్, దేవాజీ, వనజ, ప్రధాన కార్యదర్శిగా చౌదరి నారాయణ, సంయుక్త కార్యదర్శిగా చౌదరి నారాయణ, డుబ్బుల మల్లేష్, శారద, ఇతర సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా తెలంగాణ జానపద కళాకారుల రాష్ట్ర కార్యదర్శి హన్మాండ్ల మధుకర్, సంఘం జిల్లా కార్యదర్శి గురిజాల రాజబాబులు వ్యవహరించారు.

రోడ్డుపైనే మురుగు

సిర్పూర్(టి): డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో సిర్పూర్(టి) మేజరు గ్రామ పంచాయతీతో పాటు ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ప్రధాన రోడ్డు, వ్యాపార సముదాయాల వద్ద మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో ప్రజలు దుర్గంధం భరించలేక పోతున్నారు. అలాగే రోడ్డుపై మురుగు నిలిచి దోమలు వృద్ధి చెందుతున్నాయి. దీంతో ప్రజలు రోగాల భారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రెయినేజీలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.


రోడ్డుపైనే పారుతున్న మురుగునీరు


సిర్పూర్(టి)- కౌటాల రహదారికి ఇరువైపులా లేని డ్రెయినేజీ


బస్టాండ్‌లో సమీపంలో నిలిచిన మురుగునీరు

పొట్టి శ్రీరాములు పేరును కొనసాగించాలి


కలెక్టర్‌కు వినతిపత్రం అందచేస్తున్న నాయకులు

రెబ్బెన: ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం తన ప్రాణాలనే త్యాగం చేసిన పొట్టి శ్రీరాములు పేరును తెలంగాణ విశ్వ విద్యాలయానికి యధావిధిగా కొనసాగించాలని జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు గుల్బం చక్రపాణి, ప్రధాన కార్యదర్శి కొలిపాక కిరణ్‌కుమార్‌లు కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రేను కలిసి వినతిపత్రం అందచేశారు. పొట్టి శ్రీరాములు పేరును తొలగించి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించడం ఆర్య వైశ్య సమాజాన్ని అగౌరవ పర్చటడమేనన్నారు.

ఆర్యవైశ్యులను ఆదుకోవాలి..
ఇటీవల జైనూర్‌లో జరిగిన హింసాత్మక ఘటనలో నష్టపోయిన ఆర్యవైశ్యులను ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే కోవలక్ష్మిలను ఆర్యవైశ్య జిల్లా మహాసభ అధ్యక్షుడు చక్రపాణి కోరారు. సోమవారం కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యేకు వినతిపత్రాలు అందచేశారు. జైనూర్ మండల కేంద్రంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఎనిమిది ఆర్యవైశ్యులకు సంబంధించిన షాపులు దగ్ధమై లక్షల్లో ఆస్తి నష్టం సంభవించిందన్నారు. ఆర్యవైశ్యులను ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి సుగుణాకర్, తణుకు మురళీధర్, తాటిపెల్లి అశోక్, గంధం శ్రీనివాస్, తాటికొండ అశోక్ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌అర్బన్: తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును యధావిధిగా కొనసాగించాలని, జైనూర్ దాడుల్లో నష్టపోయిన వ్యాపారులకు నష్ట పరిహారం చెల్లించాలని ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు గుల్బం చక్రపాణి కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సురవరం ప్రతాపరెడ్డి జ్ఞాపకార్థం ఏదైనా కొత్త ప్రాజెక్ట్ నిర్మించి దానికి ఆయన పేరు పెట్టాలన్నారు. అదే విధంగా ఇటీవల జైనూర్ మండలంలో జరిగిన దాడుల్లో నష్టపోయిన వ్యాపారస్తులకు పరిహారం చెల్లించాలని కోరారు. నాయకులు మైలారం సుగుణాకర్, కిరణ్‌కుమార్, గంధం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

దుండగుడిని కఠినంగా శిక్షించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: మండలంలోని బుర్గుడ గ్రామంలో గత నెల 27న మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన దుండగుడిని కఠినంగా శిక్షించాలని పద్మశాలి సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరుకుల ఆంజనేయులు డిమాండ్ చేశారు. అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని సోమవారంజిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో, పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ డివి. శ్రీనివాస్‌రావ్‌కు వినతిపత్రం అందజేశారు. బాధిత బాలికకు న్యాయం చేసి, కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లయ్య, లింగయ్య, శైలెందర్, ఆవిడపు ప్రణయ్, మోహన్, యేసయ్య, రవి, శ్రీనివాస్, చిరంజీవి పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో..
జైనూర్ ఘటన మరువక ముందే మండలంలోని బురుగుడ గ్రామంలో మైనర్ బాలికపై అత్యాచారం జరగడం బాధాకరమని, దుండగుడిని కఠినంగా శిక్షించాలని సోమవారం జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ కార్యాలయంలో, జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌రావ్‌కు బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలన్నారు. సాయికృష్ణ, శ్రీకాంత్, శైలెందర్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

నేరడిగొండ: మండలంలోని లఖంపూర్ ప్రభుత్వ బాలికల ఆశ్రమోన్నత పాఠశాల విద్యార్థినులు చదరంగం, కరాటే పోటీల్లో సత్తాచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అశోక్‌రావు తెలిపారు. చుక్క ధర్మరాజు స్మారక కరాటే ఛాంపియన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్మల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో సత్తా చాటారు. కటా విభాగంలో పి.చైతన్య, ఎ.సౌజన్య, కె.కీర్తన, బి.రక్షిత, అంకితలు గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించారు. అలాగే ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి చదరంగం పోటీల్లో పాఠశాల విద్యార్థిని ఎస్.లక్ష్మి మూడో స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. అక్టోబర్ 29న హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో జరిగే పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థినులను ఏటీడీవో అమిత్, పీడీ రాధ, కరాటే మాస్టర్ సురేశ్, ఉపాధ్యాయులు అభినందించారు.

చెస్ పోటీలకు..
ఇచ్చోడ: గురుకుల పాఠశాల విద్యార్థి ఆడే చైతన్య రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికయ్యారు. నేరడిగొండ మండలంలోని బుగ్గారం గిరిజన గురుకుల బాలికల పాఠశాల విద్యార్థిని చైతన్య అండర్- 15 బాలికల జిల్లాస్థాయి పోటీలో రెండో స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. స్వప్న తెలిపారు. సోమవారం పాఠశాలలో విద్యార్థికి ధ్రువపత్రం అందచేసి అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ తపస్విని, స్వరుప, పీఈటీ జాదవ్ లత, గంగామణి, సిబ్బంది రమ్య, పవిత్ర, సావిత్రి, లీతారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

యోగాసన పోటీల్లో ప్రతిభ
ఆదిలాబాద్: రాష్ట్రస్థాయి యోగాసన పోటీల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సెప్టెంబర్ 28, 29 తేదీల్లో జరిగిన ఐదో రాష్ట్రస్థాయి యోగాసన సీనియర్ అండ్ మాస్టర్స్ పోటీల్లో 4 పతకాలు కైవసం చేసుకున్నారు. ఆర్టిస్టిక్ పెయిర్ ఈవెంట్లో భార్గవ్, ప్రజ్యోత్ సంయుక్తంగా గోల్డ్ మెడల్ సాధించారు. అదే విధంగా ట్రెడిషనల్ విభాగంలో ప్రజ్యోత్ రజత పతకంతో మెరవగా, భార్గవ్ కాంస్య పతకంతో నిలిచాడని జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి తెలిపారు.

బాధిత విద్యార్థికి అండగా ఉంటాం

ఆసిఫాబాద్‌రూరల్: లైగింక దాడికి గురైన బాధిత విద్యార్థినికి అండగా ఉంటామని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి అన్నారు. ఇటీవల మండలంలోని బూర్గుడ గ్రామంలో జరిగిన అత్యాచారం సంఘటన నేపథ్యంలో సోమవారం బాధిత విద్యార్థిని పరామర్శించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిందితుడికి కఠినంగా శిక్ష విధించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

అర్చకులు సమయపాలన పాటించాలి


మాట్లాడుతున్న సత్యనారాయణ శర్మ

ఆసిఫాబాద్‌అర్బన్: ధూపదీప నైవేద్యం పథకంలో పని చేస్తున్న అర్చకులు ప్రతీ రోజు సమయపాలనను పాటించాలని డీడీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగు సత్యనారాయణశర్మ, జిల్లా అధ్యక్షుడు ఒజ్జల శిరీష్‌శర్మలు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయయంలో నిర్వహించిన అర్చక ఐక్యత సమావేశానికి హాజరై మాట్లాడారు. ఆలయాలకు వచ్చే భక్తులతో మర్యాదగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో నాయకులు తిరుపతిచారి, ఇందారపు శంకర్, బాపుదేవ్ కులకర్ణి, శేఖర్, విజయ్‌కుమార్, అభయ్‌ఆచార్య, రాంచందర్, మురళీధర్, డీడీఎస్ అర్చకులు పాల్గొన్నారు.

పశువుల పట్టివేత

చింతలమానెపల్లి: మండలంలోని బాబాసాగర్ గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న ఏడు ఆవులను పట్టుకున్నట్లు ఎస్సై ఇస్లావత్ నరేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బాబాసాగర్ గ్రామంలో ఆవులను బొలెరో వాహనంలో తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. పశువులకు ఎలాంటి అనుమతులు, సంబంధిత పత్రాలు లేకపోవడంతో ఆ వులను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. జీశాన్ మాలిక్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి


పనులు పరిశీలిస్తున్న, ఎంపీవో సుధీర్‌రెడ్డి

తలమడుగు: మండలంలో విధులు నిర్వహించే పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీవో సుధీర్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని దేవాపూర్ గ్రామ పంచాయతీలో చేపడుతున్న పరిశుధ్య పనులు పరిశీలించారు. సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లోని ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. రోడ్లపై చెత్తాచెదారం, మురికి నీరు నిల్వకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై దాడి

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంనగర్ కాలనీలో వ్యభిచార గృహంపై సోమవారం దాడి చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. అంకత్ రవీందర్ భార్య సరోజాలు రాంనగర్ కాలనీలో గది అద్దెకు తీసుకొని గత కొన్ని నెలల నుంచి వ్యభిచార గృహాన్ని కొనసాగిస్తున్నారు. పక్కా సమాచారం మేరకు వ్యభిచార గృహంపై దాడి చేసి ముగ్గురు వీటులు మహేశ్, నవనీత్, చౌహాన్‌లతో పాటు వ్యభిచా ర గృహం నిర్వహిస్తున్న రవీందర్, సరోజా, మహిళలను సరఫరా చేస్తున్న సోయం పుష్పలతలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రభుత్వ ఉద్యోగి సేవలు మరువలేనివి

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రభుత్వ ఉద్యోగి సేవలు మరువలేనివని ఆదిలాబాద్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నరసింహారెడ్డి అన్నారు. గురువారం ఆసిఫాబాద్ ఎక్సైజ్ సీఐగా పని చేసి పదవీ విరమణ పొందిన దీపక్ దేశ్‌పాండె పదవీ విరమణ ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఆసిఫాబాద్ జిల్లా ఎక్సైజ్ అధికారి జ్యోతికిరణ్, మంచిర్యాల జిల్లా ఎక్సైజ్ అధికారి నందగోపాల్‌తో కలిసి దీపక్ దేశ్‌పాండే దంపతులను శాలువాలతో, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా వివిధ ప్రాంతాల్లో విశేష సేవలు అందించారని, తన శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


దీపక్ దేశ్‌పాండేను సన్మానిస్తున్న అధికారులు

పాఠశాలలో గిరిపోషణ మిత్ర


రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

వాంకిడి: మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో సోమవారం గిరిపోషణ మిత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు అనిమియా, హెచ్‌బీ పరీక్షలు నిర్వహించారు. 60 మంది రక్త నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించారు. రక్తహీనతకు గురి కాకుండా తీసుకోవాల్సిన పౌష్టికాహారం, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్బీఎస్కే వైద్యురాలు సంగీత, హెచ్‌ఈవో రవిదాస్, ఫార్మసిస్ట్ సాగర్, ప్రమోద్, ఏఎన్ఎంలు రుక్మిణి, శాంతబాయి, హెల్త్ అసిస్టెంట్ భగవాన్‌దాస్, పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత సాధించాలి

కౌటాల: ప్రతిఒక్కరూ ఆర్థిక అక్షరాస్యత సాధించాలని ముత్తంపేట తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ రాజ్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని ముత్తంపేట పంచాయతీ కార్యాలయం ఆవరణంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ బీమా పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీమా పథకాలతో కుటుంబాలు ధీమాగా ఉంటాయన్నారు. వినియోగదారులు బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ మహేశ్, కళాజాత సభ్యులు వెంకటేశ్, రియాజ్, తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న బ్యాంకు అధికారులు

ఐదుగురికి ప్రభుత్వ కొలువులు

- డీఎస్సీ ఫలితాల్లో ర్యాంక్ సాధించి ఉపాధ్యాయులుగా ఎంపిక

బెజ్జూర్: మండలానికి చెందిన ఐదుగురు యువకులు ప్రభుత్వ కొలువులు సాధించారు. సోమవారం విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో ర్యాంకులు సాధించి ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. మండలంలోని పాపన్నపేట గ్రామానికి చెందిన తుమ్మిడి కమలాకర్ జిల్లా ఫస్ట్ ర్యాంక్ 81.10 ర్యాంకు పాటు మండలంలోని చిన్న సిద్దాపూర్ గ్రామానికి చెందిన టాకిరే గణపతి 6 ర్యాంకు సాధించి ఉపాధ్యాయ వృత్తికి ఎంపికయ్యారు. అలాగే మంజంపల్లి గ్రామానికి చెందిన డబ్బుల మురళితో 5 ర్యాంకు పాటు డుబ్బుల సురేందర్ 15 ర్యాంకు, సలుగుపల్లి గ్రామానికి చెందిన కొప్పుల రాజు కుమార్ 5 ర్యాంకు సాధించి ఉద్యోగం సాధించాడు.


టాకిరే గణపతి


తుమ్మిడే కమలాకర్

పిల్లలకు సమాజంపై అవగాహన కల్పించాలి

ఆసిఫాబాద్‌రూరల్: పిల్లలకు చదువుతో పాటు సమాజంపై అవగాహన కల్పించాలని జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త శారద అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రకాల నైపుణ్యాలు కలిగి ఉండాలని, విద్యార్థులకు సమాజంలో జరిగే అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. క్రమశిక్షణతో చదివి మంచి ఉద్యోగాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కవిత, మమత, రాణి, రవళి, సాగర్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సమన్వయకర్త శారద

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

దహెగాం: గ్రామ పంచాయతీ మంచినీటి సహాయకులకు కొనసాగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఎస్‌ఈ రవీందర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంచినీటి సహాయకులకు అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో తాగు నీటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. మిషన్ భగీరథ పైప్‌లైన్‌ల లీకేజీలు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేందర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఇనోస్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్‌ఈ